క్లుప్తంగా

నేడు అచ్చంపేటలో గడప గడపకూ 200వ రోజు

సామర్లకోట: మండల పరిధిలో అచ్చంపేట గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం మంగళవారం మధ్యాహ్నం జరుగుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో నియోజకవర్గంలో ఈ కార్యక్రమం 200వ రోజుకు చేరుకున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు ఆరువేల గడపలు తిరిగినట్టు తెలిపారు.

నేడు గోర్సలో గడపగడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: మండలంలోని గోర్సలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ సోమవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం వారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు సేవలందించారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు



లూథరన్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

పెద్దాపురం: డివిజన్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆర్డీఓ జేఎస్ రామారావు పరిశీలించారు. సోమవారం ఆయన పట్టణంలోని లూథరన్ హైస్కూల్, జేఎస్ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించి వసతులు, పరీక్షల నిర్వహణ, క్రమ శిక్షణ, మాస్ కాపీయింగ్ వంటి అంశాలపై పరిశీలించారు. విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా అసౌకర్యాలు లేవన్నారు. ఆయన వెంట లూథరన్ హైస్కూల్ హెచ్ఎం ఫిలిప్ రాజు, ఆయా పరీక్షా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వేట్లపాలెంలో స్క్వాడ్ తనిఖీలు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెంలో పదో తరగతి పరీక్షలను స్క్వాడ్ తనిఖీ చేసింది. వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఏ, బీ రెండు సెంటర్లు ఇవ్వడం, దీనికి తోడు సోమవారం లెక్కలు పరీక్ష కావడంతో మాస్ కాపీయింగ్ జరిగే అవకాశం ఉందనే ఆరోపణ మేరకు స్క్వాడ్ అధికారి కూర్మారావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కొత్తపల్లి: ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం టీడీపీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై అధిక భారం మోపుతోందని టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, వేమగిరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ట్రాన్స్‌కో సబ్ డివిజన్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆధ్వర్యంలో పిఠాపురం రోడ్డులో ధర్నా నిర్వహించి అనంతరం ఏడీఈ ఎల్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కోతలు ప్రారంభం

- వాతావరణ హెచ్చరికలతో కొందరు వాయిదా
- యంత్రాలు ఉన్నవారు వడివడిగా పనులు



సామర్లకోట మండలం పీబీ దేవంలో వరి కోస్తున్న యంత్రం

సామర్లకోట: మండల పరిధిలో దాళ్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో 22,200 ఎకరాల్లో వరి సాగు చేశారు. వీటిలో 80 శాతం బొండాలు, మిగిలిన 20 శాతం ఎంటీయూ 1153, ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఆర్ఎస్ఆర్ 15048 రకాలను సాగు చేస్తున్నారు. ప్రతి పంటకు వ్యవసాయాధికారులు రోస్టర్ పద్ధతిలో వరి కోత ప్రయోగాలు చేస్తారు. ఈ ప్రయోగాల ఆధారంగా సన్నాలు ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు, బొండాలు 50 నుంచి 55 బస్తాలు దిగుబడి వస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు. వాతావరణం పంట కోతలకు అనుకూలంగా ఉండటంతో పాటు ప్రస్తుత దాళ్వా సాగులో నీటి ఎద్దడి లేకపోవడం వల్ల రైతులు ఆనందంలో ఉన్నారు. వారం రోజులగా వరి కోతలు ప్రారంభం కాగా వాతావరణంలో మార్పులు, వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయనే హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోతలు వాయిదా వేసుకుంటున్నారు. కోత యంత్రాలు అందుబాటులో ఉన్నవారు మాత్రం పని కానిచ్చేస్తున్నారు. సోమవారం నాటికి పది శాతం వరి కోతలు జరిగినట్టు అధికారులు తెలిపారు. కోతలు పూర్తయితే గోదావరి కాలువ కట్టేస్తారు. అనంతరం అపరాలు, పలు భూముల్లో సారం పెంచేందుకు పచ్చిరొట్ట సాగు చేసి, దుక్కి చేస్తారు.

వాతావరణం అనుకూలించింది



దాళ్వాలో రైతులు ఎక్కువగా బొండాలు సాగు చేశారు. పీబీ దేవం ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులకు సమృద్ధిగా నీరు అందింది. కోత యంత్రాలు అందుబాటులో ఉండటంతో ప్రస్తుతం సన్నాల కోతలు జరుగుతున్నాయి. బొండాలు మరో 10 రోజుల తరువాత కోతలకు వస్తాయి.

– మలకల వరాలబాబు, సొసైటీ అధ్యక్షుడు, పీబీ దేవం

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం



మండలంలో ఉన్న 21 ఆర్బీకేల పరిధిలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల ధాన్యంలో తేమశాతం సమస్య ఉండదు. మండలంలో 70 శాతం మంది రైతులు వెదజల్లు పద్ధతిలో సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. సార్వా సీజన్‌లో రైతులకు నాలుగు రోజుల్లోనే సొమ్ములు చెల్లించాం.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

సమస్యల సత్వర పరిష్కారానికే స్పందన

- ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు తొమ్మిది అర్జీలు



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. సోమవారం నాటి స్పందనకు డివిజన్ నుంచి తొమ్మిది అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అధికారులు స్పందనకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద పలు విభాగాల అధికారుల అందుబాటులో ఉంటారని, ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహ నిర్మాణ శాఖ నుంచి రవిశంకర్, వ్యవసాయ ఏడీఏ దైవకుమార్, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డిటీ భానుకుమార్, ఎంఈఓ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తూర్పుపాకల మాజీ సర్పంచ్‌కు న్యాయం చేయాలి..

మండలంలోని తూర్పుపాకల గ్రామ మాజీ సర్పంచ్ సూరవరపు సుబ్బాయ్యమ్మకు న్యాయం చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు కోరారు. ఆమెకు నిలువ నీడలేదని, తగిన వసతి కల్పించాలని వారు కోరారు. ఆమెకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెంకే వెంకటలక్ష్మి, తమనార లక్ష్మణ్ దివాకర్, వంగలపూడి సతీష్, సుంకర కృష్ణవేణి, చంద్రముఖి, సమ్మింగ సాయి, అంజి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాను నిలువరించండి..

దివిలి గ్రామంలో ప్రభుత్వ స్థలం కబ్జాపై టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే చినరాజప్ప అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం స్పందనకు వచ్చిన ఆయన ఈ విషయమై ఆర్డీఓను నిలదీసి చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆక్రమిత స్థలంలో షెడ్లు నిర్మించి, గేటు పెట్టేశారని వివరించారు. దీనిపై ఆర్డీఓ సానుకూలంగా స్పందించి విచారణ జరుపుతున్నామని, సత్వరం పరిష్కరిస్తామని చెప్పడంతో ఎమ్మెల్యే వెళ్లిపోయారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ కొత్తెం వెంకట శ్రీనివాసరావు ఉన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



కొత్తపల్లిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



సామర్లకోట 26వ వార్డులో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వార్డు ఇన్‌చార్జి

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గ్రామాల్లో సోమవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు.

జగనన్నే మా భవిష్యత్‌కు అపూర్వ స్పందన

సామర్లకోట: జగనన్నే మా భవిషత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోంది. మున్సిపాలిటీ పరిధి అన్ని వార్డుల్లో కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరుగుతూ ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ఐదు ప్రశ్నలకు 99 శాతం సానుకూలంగా స్పందన లభిస్తోందని కౌన్సిలర్లు అంటున్నారు.

14న మద్యం షాపులు మూసివేయాలని వినతి

పిఠాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులు మూసి వేయాలని స్థానిక జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గొల్లప్రోలు తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. జన విజ్ఞాన వేదిక, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ దళిత సంఘల నాయకులు ఏలేటి నానిబాబు, దాసం గోవిందరాజులు, ముడదా రాజ్‌కుమార్, గొర్రల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



ఆపద మిత్రలకు శిక్షణ ప్రారంభించిన ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: విపత్తులపై ఆదప మిత్రలు అప్రమత్తంగా ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. ఆపదమిత్రల శిక్షణకు హాజరుకాకుండా మిగిలిపోయిన వారికి సోమవారం శిక్షణ ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించాలనే విషయంపై 12 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. తరగతులతో పాటు, ఫీల్డ్ విజిట్ కూడా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్రలకు రూ.10 వేల విలువ చేసే కిట్లను ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, కె ఆర్.నిహారిక, బి.ఆంజనేయులు, వి.ప్రసాద్, విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి పాల్గొన్నారు.

1285 స్కూళ్లలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లు



సమీక్షలో మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి

కొత్తపల్లి: జిల్లాలోని 1285 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,70,815 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తామని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి అన్నారు. మండలంలోని కొత్తమూలపేట ఎంపీపీ పాఠశాలలో జగనన్న విద్యా కనుక కిట్లను భద్రపరిచే తరగతి గదులను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీపై మండల కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు అవసరమైన విద్యాకానుక కిట్లను సిద్ధం చేయాలని సూచించారు. కిట్లు భద్రతపై ఎంఈఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆమె వెంట సీఎంవో చామంతి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

జగనన్న విద్యా కానుక పంపిణీ పారదర్శకంగా ఉండాలి

పిఠాపురం: జగనన్న విద్యా కానుక పంపిణీ పారదర్శకంగా ఉండేలా చూడాలని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి ఉపాధ్యాయులు అధికారులకు సూచించారు. పిఠాపురం మండల వనరుల కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్లను తనఖీ చేశారు. అనంతరం జగనన్న విద్యా కానుక పంపిణీపై అధికారులతో సమీక్షించారు. ఆమె వెంట సమగ్ర శిక్ష అభియాన్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎంఈఓ ఆర్‌వీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రజా ప్రయోజన ప్రాజెక్టులు రూపొందించాలి

- రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ సందర్శన



ఇంక్యుబేషన్ సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, చిత్రంలో వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శాస్త్ర, సాంకేతిక యూనివర్సిటీగా కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకే ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ప్రజా ప్రయోజన ప్రాజెక్టులు రూపొందించాలని రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించి ప్రాజెక్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జన మైత్రి పోలీస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్, రోడ్డు ప్రమాదాల హాట్‌స్పాట్‌ను గుర్తించే పరికరం, అమెరికా ప్రభుత్వం నుంచి అవార్డు పొందిన హస్పిటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ప్రస్తుతం విద్యార్థులు రూపొందిస్తున్న హెల్త్‌కేర్ టు హోమ్ మొబైల్ అప్లికేషన్ వివరాలు తెలుసుకున్నారు. ఇటువంటి వాటిని ప్రోత్సహించి ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వామ్యం అవుతున్న వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజును అభినందించారు. ఆయన వెంట రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్లు కొప్పిరెడ్డి పద్మరాజు, ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ జేవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘ నేత రామం మృతి

పిఠాపురం: స్థానిక బొజ్జావారి తోటకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకుడు అడబాల రామం సోమవారం మృతి చెందాడు. సీపీఎం నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పిఠాపురం భవన నిర్మాణ కార్మిక సంఘం స్థాపనలో ముఖ్యుడైన రామం మృతి భవన నిర్మాణ కార్మిక సంఘానికి తీరని లోటు అని పలువులు సంఘ నాయకులు అన్నారు. సీపీఎం నాయకులు డి.సత్యనారాయణ, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.చిన్న పాల్గొన్నారు.

కమిషనర్ మహేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా రావిరాల మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఉదయం 10.30కు కమిషనర్ కె.రమేష్ నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. 2016 క్యాడర్‌కు చెందిన ఆయన గతంలో రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. తొలిసారి నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన కమిషనర్‌కు అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులు స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నగరపాలక సంస్థ ద్వారా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యాంశాలు, నగరపాలక సంస్థకు చెందిన ముఖ్య అంశాలపై దృష్టి పెడతామన్నారు. కమిషనర్‌ను ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ హరి ప్రసాద్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, మేనేజర్ కె.సత్యనారాయణ, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఏవో శిరీష్, ఉద్యాన శాఖ ఏడీ టీవీ సిరిల్, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, సీటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు పలువురు డీఈలు, ఏఈలు ఉన్నారు.

కమిషనర్ రమేష్‌కు ఆత్మీయ వీడ్కోలు

నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్‌కు సోమవారం కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏడీసీ నాగ నరసింహారావు మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కమిషనర్ రమేష్ ఎంతో సహకారం అందించారన్నారు. కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజా సమస్యలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించే ఆయన వద్ద పనిచేయడం ఎంతో అదృష్టమన్నారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో సంతృప్తికరమైన సేవలు అందించగలిగానన్నారు. ఆర్వో చెక్కా రమణ, ఆయా విభాగాలు సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్ద మసీదు అభివృద్ధికి సహకారం

కాకినాడ: రహదారి విస్తరణతో నష్టపోతున్న పెద్ద మసీదు పునర్నిర్మాణానికి అన్ని విధాలా తోడ్పాడతానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రంజాన్ సందర్భంగా మసీదు సెంటర్‌లోని జామియా మసీదులో సోమవారం ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. రానున్న రంజాన్ నాటికి మసీదును సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తానన్నారు. ఆది నుంచి తనకు ముస్లిం మైనారిటీలు అండగా ఉన్నారని, వీరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జామియా మసీదు అధ్యక్షుడు ఇజాదుద్దీన్, కార్యదర్శి నాజీర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్నీ, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు రహ్మాన్ ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్‌ఖాన్, పార్టీ మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు బాషా, నగర అధ్యక్షుడు ఖాలిదుద్దీన్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

హాటుపాట్లు

- మండిపోతున్న ఎండలు
- మెట్టలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- అల్లాడిపోతున్న జనం



రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నిర్మానుష్యంగా మారిన జాతీయరహదారి

ప్రత్తిపాడు: మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సోమవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటలకే రోడ్లపై రాకపోకలు తగ్గాయి. సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

నిర్మానుష్యంగా రహదారులు

ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు రోడ్లకు ఇరువైపులా చెట్టకింద వాహనాలను నిలిపివేసి సేద దీరారు. ఫలితంగా ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చిన వారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి వాటిని వినియోగించారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు జనం శీతలపానీయాలను ఆశ్రయించారు. ఫలితంగా జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు విక్రయాలు జోరందుకున్నాయి. మరోపక్క వచ్చే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు చేసింది. ఏప్రిల్ నెలలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే ఇక మే నెలలో పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ప్రత్తిపాడులో ఎండ నుంచి రక్షణగా గొడుగును ఆశ్రయించిన యువతులు



నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు - సామర్లకోట రోడ్డు

ఈ జాగ్రత్తలు తీసుకుంటే మేలు

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకువెళ్లాలి.
- పలుచటి తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధిక శ్రమతో కూడిన పనులు చేయకూడదు.
- మంచినీరు, మజ్జిగ, నిమ్మరసంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, శీతల పానీయాలు తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి వారికి వెంటనే వైద్య పరీక్షలు చేయించాలి.
- ఎక్కువగా నీరు, ద్రవ పదార్థాలు సేవించాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినపుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

వడగాడ్పులతో జాగ్రత్త



రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. మే నాటికి ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండలో పని చేసే వారికి, తిరిగే వారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైన వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి క్లాత్‌తో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓరల్ రీ హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– ఆర్ ఆర్ పవన్‌కుమార్, మండల వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

స్కేటింగ్ శిక్షణకు అడ్మిషన్లు ప్రారంభం

తుని: తుని, పరిసర ప్రాంతాల్లోని క్రీడాకారుల కోసం రోలర్ స్కేటింగ్ అకాడమీ ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సోమవారం తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందడానికి క్రీడాకారుల నుంచి అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. స్థానిక రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో నిర్మించిన స్కేటింగ్ ట్రాక్‌లో శిక్షణ ఇస్తామన్నారు.